"అహా! మరో ముగుదప్పు!- రాయలవారు, శృంగారం రెట్టించారన్నమాట -"

"నేను - వాణిని !" దివ్య - ధీమాతో పలికింది.

"అంటే ?"

"సరస్వతిని - భాషాదేవిని ! - నన్ను దాసితో, పోలుస్తావా ? - ఇలా ఈసడించుతావా ?."

రామలింగడు తొణుకూ బెణుకూ లేకుండా, పరకాయించి చూశాడు :

"నిన్ను, ఏమీ ఈసడించ లేదమ్మా ! -ఆడదానివి అన్నాను. కాదనిగదమాయిస్తే- నీయిష్టం !."

వాణికి నవ్వు వచ్చినట్టుంది : కాని, రోషం తెప్పించుకుంది.

"నేను సామాన్య మానవినైతే, - ఈవేళప్పుడు ఇక్కడ ఎలా ప్రత్యక్షం కాగలను ?"

రామలింగడు, మంచం చివరకు జరిగాడు.

"ఇదిగో పిల్లా - నీకు కోపం రాదంటే-నీకు తెలిసిందే అనుకో - ఒక్క సూక్ష్మం చెప్తాను :

అసలు - ఇంతకూ నీకు చదువు వచ్చునా ?

కాశీమజిలీలు చదివావా ?

ఫలానారాజు ఏం చేశాడు ?- ఒంటిస్తంభం మేడకట్టి- మేడంతా ఒక్కటే గదిగా కట్టి - గదిలో ఆ పడుచును పెట్టి- అష్ట దిక్కులా పహరాపెట్టి - ద్వారబంధానికి, - కప్పతాళం పెట్టగా - ముద్రలు ముద్రలుగానే ఉండగా - ముగ్గురు బిడ్డల

తల్లి కాలా ?- ఎంతో కష్టంమీద, ఏ ఒక్క పోటుటీగో లోప
లికి జొరబడ్డదనుకో - పాపం,- దానివల్ల ఏమైఉంటుంది ?

ఇంతకూ, ఏతావతా నే ననేది - ఆడది తలుచుకోవాలి
గాని - రావడానికి పోవడానికి అడ్డం ఏముంది ?"

- తిరిగి నడుం వాల్చిపోయాడు.

వాణికి ముచ్చెమటలూ పోసినవి. కళ్ల నీళ్ల పర్యంతం
అయింది-

"నే నెవరో తెలియదా ?"

"రాజధానిలో యావన్మంది సుందరాంగుల నైనమూ,
కరతలామలకమైన ఘటికుణ్ణి కాను. తతిమ్మా ఆస్థానకవు
లందరూ, - ఇందులో - ఘట్టి దిగ్గజాలు !- స్వాములు పూర్వా
శ్రమంలోకూడా, - అంత ఉద్దండులు కారు !-

వాణికి ఒళ్లు తెలియని ఆవేశం వచ్చింది :

"దైవదూషణ చేస్తున్నావు ! నేను అనుగ్రహించక
పోతే, - నీకు ఈ కవిత్వం ఎలా వచ్చిం దనుకున్నావ్ ?-"

రామలింగడు కనుబొమలు రిక్కించి ఊరుకున్నాడు ;
వాణి, అనునయంగా -

"నన్ను పోల్చుకోరాదా - ప్రణమిల్ల రాదా ?" అని
బతిమాలింది.

"దానికేం - పోల్చుకోమంటే - నీమాట కాదన లేను
కాని, - ప్రణయం అంటే మటుకు—"

వాణి, కస్సుమన బోయింది -

"మాటకు అడ్డంగా కోపంరాకు !- పాపం, యిందాకటినుంచీ అలాగే ఒళ్ళో ఉంచుకున్నావు, ఒరుసుకుంటూందేమో - ఆ వీణ క్రిందకు దించుదూ :"

"ఉహుఁ - ఎప్పుడూ, నా అంకపాళిని, ఇలా ఉండవలసిందే - కచ్ఛపి !"

"అలాగేం ? ఏదీ మోగించు !"

"నన్ను పరీక్షించుతున్నావా ?"

"తెలియక అడిగాననుకోరాదూ ?- అదీ, అలంకారార్థమా ? - లేక, ఎన్నడన్నా, ఎడనెడ వాయించుతూంటూవా ?"-

"వాణీ వీణా సినదం - నాగరలోక ప్రసిద్ధమేకద ?- నీవు పెద్దన్నగారి పద్యమన్నా చదువలేదా ? -

"పుండరీకాసనమున కూర్చుండి మదికి యింపుదళుకొత్త - వీణవాయించు - చెలువను !'

"సరిపోయింది: తాతయ్య పద్యమూ, నీ విద్యకు తార్కాణం ! పెద్దన్నగారు, వట్టి అమాయకుడు ! తెల్లనివన్నీ పాలు అని నమ్మేరకం !-

ఓనాడు ఏమైందనుకున్నావ్ - ధూర్జటి అని మాతోటి ఆసామి వున్నాడులే : భసితాంగుడు : స్ఫటికాలంకృత వీనో రస్కుడు : ఆయన, పెద్దన్నగారి యింటికి వేంచేస, ముద్దుకు, వాళ్ల మనవణ్ణి, చంటివాణ్ణి ఒళ్లోకి తీసుకున్నాడు: పసివాడు, వొళ్ళో స్ఫటికాలతో ఆడుకుంటున్నాడు :

పెద్దన్నగారు, - ఈ వైనం చూశారు :

తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయము
నమోదు సంఖ్య

'అదేమిటిరా అబ్బీ ! - పెద్దమనిషి యింటికివస్తే-అలా పాలకు ఎగబడతావేం!-'అని మనుమణ్ణి, తన ఒళ్లోకి లాక్కున్నారు : ధూర్జటి ఒళ్లో పిల్లాడు కూర్చున్నాడూ అంటే, - పాలకే అనుకున్నాడా ఆయన - అలాగే - ఒళ్ళో వీణ పెట్టుకు కూర్చుంటే,- వాయించుతావని భ్రమపడి ఉండచ్చు- ఆ పద్యాని "కేంగాని - వాయించడం, ఎవరు నేర్పారు ! - గురువు హస్తవాసినిబట్టి - ఇలాటి విద్యలు రాణించుతా యంటారు గద -

వాణికి, - మనిషికి వచ్చే రోషం వచ్చింది.

"వాణికి వీణావాదనము ఒకరు నేర్పాలా ? - అది నాకు సహజం !"

"నాకు - కవిత్వ మల్లేనా ? -

ఏం - ఏమిటి అలా చూస్తావ్ ! - నీకు వీణ వాయించడం దానంతట అదే అబ్బితే - నాకు పద్యాలు వాటంతట అవే పలుకరాదేం ! -"

"నీకు కవిత్వం ప్రసాదించిన దేవిని నేను !"

"ఇదిగో అమ్మాయ్ ! - ఉక్రోషంలో, నీకు అనే మాటేదో - అనని మాటేదో తెలియడం లేదు-

నీకు వీణ వాయించడం ప్రసాదించింది, నేను ! - అని నేను మోరాయించటానికి పూనుకుంటే, - నీ మనసు ఎలా ఉంటుంది చెప్పు ? - చలి గుయ్యారంగా ఉన్న రాత్రి, నాతో ఇలా కబుర్లతో - కాలహరణం చేయడంకన్న నీ పడుచు

తనానికి మరో పరవడి లేదాయేం! - మనసు ఎక్కడా లేకపోతే - ఈపూటకు మాపక్కను చోటుంది -"

"నిన్ను శపించేను సుమీ!"

రామలింగడు మీసం ఎత్తిపట్టి, పెదవి విరిచాడు - "నీకు అలాటి ముక్కవే ఉంటే తీర్చుకోవచ్చు! - నీకు సాధారణంగా, వరమియ్యడమే అలవాటుకాని, శపించడం చేతనౌనా! - ఎలాగో చూపిస్తాను - ఇలారా! - వచ్చి, సరసను కూర్చుని, రెండు చేతులూ కంఠానికి పెనవేసి - ఆశాపమేదో అనేయ్ - అప్పుడుగాని పోరదు-"

వాణికి నవ్వు వచ్చింది -

"ఇంత మొండివాడివేం?-"

"అంతా అంబ చలువ! - ఇక వెళ్ళవమ్మా! - మీ ఆయనకు మెళకువవచ్చి పక్క తడుముకుంటే - చేసుకున్న ఇల్లాలంటూ ఉన్న తరువాత ఆ వయసులో చేతికన్నా తగలక పోతే - మరీ ఉసూరుమనదూ? - వాణి అక్కడ నిలువలేదు:

రామలింగడు నవ్వుకుంటూ నడుంవాల్చబోతున్నాడు- బయట గుమ్మంలోనుంచి, - రాయలవారి అత్తగారు, నిదుర మత్తుగా పలుకరించింది -

"అమ్మా అంటున్నారు, - ఏమిటి స్వామీ-"

"మీ అమ్మ సంగతే-"

ఆ మాట విని అత్తగారు, కొంచెం చొరవగా గుమ్మంలోకి వచ్చింది: చూసి వెనక్కు తగ్గింది.

"తగ్గుతా నెందుకూ. - రా, - సన్యాసి ఎక్కడున్నా సన్యాసే - ఇదీ మన తీరు.- నీ వక్కడా, - నే నిక్కడా -" రామలింగడు లేచి రెండడుగులు ముందుకు వేశాడు -

"స్వామీ-చిన్నదానివల్ల ఏమన్నా అపరాధం ఉంటే-పాదసేవ నేను చేస్తాను" అంటూ అత్తగారు చేయి జాచింది.

రామలింగడు పతాకతో వారించాడు -

"నీకు అంత పటుత్వం ఉందని మాకు తెలుసును. ఆనాడు మీ అవ్వ యీమాటే అంది -"

అత్తగారి ఆశ్చర్యానికి అంతులేకపోయింది- "స్వామీ!- మా అవ్వకు తమ సేవ లభించిందా ?-"

"ప్చ ! - రవంతలో జెడిసిపోయింది - ఆ ధరకు మొగ్గ లేకపోయినాం, - కాశీకి ప్రయాణమైనాం - తరువాతనే విధి లేక కన్నెరికమైనట్టు - శిష్యులవల్ల కర్ణాకర్ణిగా విన్నాం - ప్రూం - ఆ పూర్వాశ్రమపు మమతలు తలచుకుంటే - నీకూ నాకూ అపచారం జరిగేట్టుంది - పోయి పడుకో - వెళ్ళేప్పుడు తలుపు బయట వేసేయి ! - ఏం విన్నా. - నిన్ను కాదనుకో - భగవన్నామస్మరణ చేస్తూ, పట్టినంత నిద్రపో-" అత్తగారు అటు మళ్ళింది, - రామలింగడు ఇటు తిరిగాడు -

౨

పిల్లలమర్రివారి యింట్లో, - ముందు నడవాలో, - బంగారు సెమ్మెలో జ్యోతి ఘుమఘుమ లాడుతూ వెలుగుతూంది :

కొత్తగా అమరిన హంసతూలికా తల్పంమీద, – అన్నయ్యా – వదినా ఆదమరచి ఏకంగా నిద్రపోతున్నారు, మందువాకు ఆ పక్కగదిలో –

ఇవతలి పక్క నసారాలో – ఒంటిరెక్క మంచం వాల్చి ఉంది :

వాణి దూకుడుగా అవతరించి,–దానిమీద కూర్చుంది: అలా, ఎంతోసేపు కూర్చుంది : బద్ధకంగా కూర్చుంది: పక్క, చేతికి పడుచుగా సోకుతూంది: వాణి నడుం వాల్చింది. కాపురంచేసే అలవాటుకొద్ది – ఒదిగి, – అవతల, చోటు ఉంచింది.

అలవోకగా, ఖాళీ మీదికి, వాణి చేయి జాపింది. మనసు జల్లుమన్నట్టు లేతగా వణికింది. పుటుక్కున తీగల్లే ఎగిరి కూర్చుంది. పెదవి అదిరదిరి పడుతూంది:

చీకట్లోంచి కూనిరాగం, ఈ సరసకు వస్తూంది. వస్తూ వస్తూ ఆగిపోయింది –

పినవీరన్న పక్కవైపు పరాయించి చూచాడు – అడుగులో అడుగు వేసుకొంటూ రానే వచ్చాడు –

“ఎవరది ?”

“నీ రాణి !”

పినవీరన్న ఒంటిపోచ జంధ్యం వేలికి మెలివేస్తూ వింత పోయినట్టు నవ్వాడు :

"ఎవరో అయిన యింటి పిల్లకు, అర్ధరాత్రి అంకమ్మ శివమెత్తింది - పాపం ! - నాకన్న పసిఅయిన సరసు డెవరికీ తీరిక లేదేమో -

"ఇక్కడికి ఎలా వచ్చావ్ ?"

వాణి బుసకొట్టింది-

"ఎ దుకు వచ్చావని అడగవేం ? -

"అడిగానే అనుకో : ఇంత కసుగాయ వా తమ్ముడూ అని కామన్న ఆక్షేపించడూ-"

"ఉహుఁ నే ననుకున్నది నిజమేనన్నమాట-"

"ఏమిటా మాట ?"

"ఏమిటా - ?" వాణికి ఇక తామసం ఆగిందికాదు-

"నీవు మనిషివి కాదూ ! కవినంటూ రొమ్ము విరుచుకు తిరుగుతున్నావే - నీతీ జాతీ అంటూ లేదూ-"

-పినవీరన్న తెల్లబోయినాడు-

"ఇదిగో, పిల్లా - అలా బాకా పట్టకు - గొంతు దింపు - మా వదిన విన్నదా అంటే."

"-ఎవరు విన్నా ఇంకా పోయేదేముంది ? - నన్ను, నలుగురి నోళ్లలో యిదివరకే పడేశావు!"

"నేనే ?-"

"ఇంకా, 'నేనే!' అంటావా? - పరాయివాడి భార్యను పట్టుకు - 'అది నా రాణి !' అని చాటిస్తావా ?-"

"ఏమిటే ?-" పినవీరన్న తెల్లపోయినాడు - ఒక్క-క్షణం ఆలోచించాడు : బిగ్గరగా నవ్వేశాడు -

"ఓ ! - నీవు బ్రహ్మదేవుడి పెళ్ళానివా అవ్వా !-"

వాణి కళ్ళల్లో భైరవి రాగం పలుకుతూంది - అవ్వా అనగానే -

"అయితే కూర్చో - కథేమిటో చెప్తాను-"

వాణి మోరాయించింది. కాని, పినవీరన్న అడుగు దగ్గరగా వేయగానే - బుజాలు పట్టుకు కూర్చోబెడతాడేమోనని. - వయ్యారంగా, - త్రిభంగిగా. - కూర్చున్నది -

" - నిన్ను నా రాణి అన్నమాట, నిజమే ! -

"కాని, - అన్నది నేనుకాదు - మా వదిన ! -

"కాదన్నానే అనుకో - ఇందుకు మళ్లా ఓ రాద్ధాంతం బయలుదేరుతుంది, ఇంట్లో - ఆవిడ నోటికి వెరచి వూరుకో వలసి వచ్చింది - పైగా ఈ అభాండంవల్ల నీకు పోయే దేముందిలే అనుకున్నాగాని, -

తామరపువ్వు విసిరినట్టు వాణి పినవీరన్న మీదికి చేయి చాపి - మాటకు అడ్డంవచ్చింది -

"నాకు పోయే దేముందా ? - ఈ మాట మావారి చెవిని పడితే - నా కాపురం ఏమైపోతుంది ? -

సాటి ఆడది,- నన్ను పట్టుకు యింతమాటఅటుందా? - ఆ యిల్లాలినే నిలవేస్తానుండు - " అని లేవపోయింది. పిన వీరన్న సంభ్రమంతో అపవారించాడు -

"నీ పుణ్యమాయెగాని, - ఆ పనిమాత్రం చేయకు ! ఇప్పుడు ఆవిడ కంటబడ్డావా అంటే - అటూగాకుండా ఇటూ గాకుండా అయిపోతావు ! ఆవిడకు, జ్ఞాపకశక్తి అనంతం -

ముక్కోటి దేవతల పుట్టుపూర్వోత్తరాలు పేరు పేరు వారీగా ఆవిడకు తెలుసు - నిలవేసి అవన్నీ తవ్విపోసిందా అంే, - కల్పాంతానికైనా, మళ్లీ నీకు గుక్క తిరగదు - ”

వాణి - ఈసూ - కోపం గిలిగింతతో చిరునవ్వుగా -

“మీ వదిన అంత గయ్యాళి అన్నమాట !” అని కులికింది.

“అన్నమా టేమిటి ? - గయ్యాళే - పరమగయ్యాళి - అన్నయ్య ఎప్పుడూ, మనసులో యీ ముక్కే జపిస్తూ ఉంటాడు.”

“పాపం ఎలా వేగుతున్నాడో - ఆ మానవుడు-” అని వాణి,- జాలిగా అనపోయింది.

“అందుకే - నేను యిలా ఉండిపోదామనుకున్నాను. వదిన, నన్నూ కొన్నాళ్ళు రంపకోత కోసింది - నన్నో యింటివాణ్ణి చేస్తే, ఆ వచ్చే కుర్రదాన్ని వేపుకు తినవచ్చును కదా అని -

ఈ ఒక్క అంశంమీద మా ఉభయులకూ అనేక దివ్యవర్షాలు శాంతిసమరం సాగింది - తతిమ్మా ఏ విషయంలో అయినా, నేను మా వదిన కళ్ళముందు పిల్లికూననే; కాని ఇందుకు మాత్రం ప్రాణాలొడ్డి అయినా ప్రతిఘటించ తలచుకున్నాను.

సరే ప్రాణంమీద ఆశతీరిన తరువాత కవిత్వం అదే ఆవేసించింది___” వాణికి యీ చిగురు ముక్కలు అర్థం కానంత ఆశ్చర్యం వేసింది-

"అంటే-" అని తెల్లబోయింది- పినవీరన్న, ఖచ్చితంగా,-

"అంతే-ఏదో పిట్టకు ప్రాణంపోగానే,- వాల్మీకికి కవిత్వం వచ్చింది- నాకు, నా ప్రాణం ఉన్నా సరే పోయినా సరే అనే స్థితిలో- అది పట్టుకుంది- పద్యానికి పద్యం తెగులనీ,- అదే ఒకటై,- రెండై- చివరకు అంత గ్రంథం అయింది. ఆ తరువాతి కథంతా, కేవలం అన్నయ్య లౌక్యం. రాజుగారి దగ్గిర మరో పదిడబ్బులు ఎక్కువ రాలడానికి- ఇదో వంక పెట్టాడు !- రాజుగారిని నెత్తి వాడిక్రింద కట్టి. వాడ వాడంతా, అదేపాట మొదలు పెట్టింది-

"కాని, - నాకు ఒకటే సందేహం -

అన్నయ్య, చెపితే చెప్పాడు పో - వీళ్లిల్లు బంగారం గానూ - వాళ్లు ఎలా నమ్మారో ? -

నేనేమో పగలంతా ఆగమ్మ కాకిలాగా తిరిగి, - రాత్రి గదిలో తలుపు బిగించుకుని, - కుక్కలో కునుకుతున్నానట - ఓ అర్ధరాత్రివేళ, నీవు, - ఘల్లున సాక్షాత్కరించి, నా దగ్గిర కూలబడి, - గాజుల గలగలలో, - కావ్యం అల్లేశావట ! - దేవలోకంలో ఉండే చిన్నది కదా, - తెలుగెప్పుడు నేర్చుకుంది, - గణయతి ప్రాసలు ఎలా కంఠతా పట్టింది ? - అని, ఒక్కడన్నా ముక్కుమీద వేలు వేసుకోండే ? - అందరూ డూ డూ బసవన్నలు ! - "

— వాణి, ఉలకదు, పలకదు : అనిమేషనయనాలు రెండూ, అతడి మొగానికి అప్పగించి వూరుకుంది -

"ఇదీ, ఇందులో ఉన్న దేవరహంస్యం - కాసి, నామాట లేమీ నువ్వు నమ్మినట్టు తోచడంలేదే! -"

వాణి రోషంతో, - "మామూలు మనిషి ఆడితే, అబద్ధం-నీవాడి తేకవిత్వం-నీవు అని, వదినమీద పెడుతున్నావా? సాటి ఆడదానికీ నాకూ ఈ రూపేణా తగూపెట్టి, నీవు తప్పుకుని చోద్యం చూడాలని కులుకుతున్నావా?- ఇప్పటికైనా, చేసిన తప్పు ఒప్పుకో, - ఇక ఎన్నటికీ ఇలాటి అపచారం మనసా - వాచా కర్మణా చేయనని ప్రాధేయపడితే,- కరుణించి అభయ మిస్తాను -

—వింటున్నకొద్దీ, పినవీరన్న జుట్టు కోపంతో గింగిరాలు తిరిగింది. చిరుమీసం కజ్జాకు కాలుదువ్వింది.

"కరుణించి వదిలేద్దామనుకున్నా గాని. - ఆ మర్యాద దక్కించుకోలేక పోయినావ్ -

"అవ్వా! - ఒక్కటే ముక్క చెప్తా విను - యీ లోకం గొడ్డుపోయిం దనుకున్నావా? - నదరైన పడుచు కరవైందనుకున్నావా? నాకు అలాటి మనసే ఉంటే, - అవ్వను పట్టుకు వసంతాలాడే అగత్యం లేదు - నాలాటివాడి రాణీవని అపవాదు వచ్చినా, - ఈ వయసులో నీకు పరువేగాని, - నేను సాటివారిలో తల ఎత్తుకు తిరగగలనా? - త్రిభువనాల్లో నిన్ను భరించగల ముదుసలి ఒక్క బ్రహ్మన్నే - మీ యిద్దరికీ యీడూ జోడూ కుదిరింది - ఆయన జటాజూటం, నీ కబరీ భరం - అచ్చంగా పండు వెన్నెలే - సర్వ శుక్లా! - ఈ సరసం చాలిద్దామా? -"పినవీరన్న నిర్లక్ష్యంగా అక్కడ

నుంచి వెళ్లిపోయినాడు - వాణి ఉసూరు మంటూ వెన్నెల్లో కలసిపోయింది.

౩

"ఇక్కడనుంచి ఎక్కడికమ్మా !" అని వగచుకుంటూ అడిగింది, - హంస : వాణి, - చిర్రూ బుర్రూమంది -

"అడిగావ్, శకునపక్షీ ? - ఎక్కడికైతే నీ కెందుకే, నోరుమూసుకు ఎగురు !- నేను వాలమన్నప్పుడు వాలు -"

పోగా పోగా అన్నీ రాళ్లూ రప్పలూ -

"ఆ రాయిముందు వాలు !"

అక్కడ ఒకటి కాదు, రెండు రాళ్ళున్నాయి-ఎదురూ బదురుగా, ఒకటి రామవిగ్రహం - రెండోది పోతన్న :

వాణి, హంసమీదించి క్రిందికి దూకింది. మీది మీదికి ధూకుడుగా వెళ్ళింది, - ఆగిపోయింది - పోతన్న కనురెప్ప అయినా కదల్చకుండా, ఏదో సీసపద్య ధోరణి గొణుక్కుంటున్నాడు -

ఆ భాగవతుడి పరాకాష్ఠ, నిర్లిప్తత్వం అనుకుని,- ఉమ్మ వారు అంతలో ఆడదైపోయింది, - వెనుకవైపు చేతిలో లీలా కమలం, కళ్ళకు అడ్డం పెట్టుకుని,- మానవ పరిభాషలో - ఏడవటం మొదలు పెట్టింది - వెను వెంటనే చేతిలో అలవోకగా ఉన్న కచ్ఛపి శృతి అందుకుని తానూ అనుగుణ్యంగా మోగటం ప్రారంభించింది : తిప్పటంలో సతమతమైపోయి, అప్పుడే తెప్పరిలుతూన్న హంసకు ఈ ఘోష దుస్సహామని

పించి, - రెక్క విప్పి చెవులు మూసుకుంది: కాని లాభం లేదనిపించింది: గునగున పోతన్నగారి దగ్గరకు వెళ్ళి, చేతి గంటం, తాటాకూ తెక్కతో ఎగురగొట్టి, - ముక్కుతో పొడుస్తూ - ఆ గొడవేదో కాస్త ఆలించవయ్యా !- అన్నట్టు తంటాలు పడ్డది.

పోతన్న కన్ను విప్పాడు - వాణి కనబడ్డది- దేవతలను అనుక్షణం చూడ్డానికి అలవాటైనచూపల్లే - సంభ్రమం ఏమూ త్రమూ లేకుండా, - నిదానంగా 'ఓ, నీవా?' అన్నట్టు రవంత కను మెలిపాడు - ఇంతలో ఆ కంట తడి కని పెట్టాడు - పద్యం అందుకున్నాడు - 'కాటుక కంటి నీరు___'

వాణి గప్పున, తామరతూడులు ఎడాపెడా విసిరినట్టు చేతులతో రొమ్ముకట్టుకుని - "అంతటితో ఆగు!" అని కేక వేసింది-

పోతన్న అతి వినయంగా - "ఆగుతే, పద్యం పూర్తి కాదు శారదా!" అన్నాడు-

"నాపరువు పోయిన తరువాత - నీ పద్యం పూర్తి అయితే నేం - కాకపోతే నేం - పోతన్నా - నన్ను ఇంతవంచన చేస్తావా!

పోతన్న, అమాయకంగా - "నిన్నా" అని నిజంగానే అన్నాడు.

"ఇంకా 'నిన్నా' అంటావా? - నన్ను తీసుకువెళ్ళి నా మామగారికి అంకితం చేస్తావా?"

పోతన్న ఒక్కక్షణం పరకాయించి ఆలోచించి, - నవ్వేశాడు.

"ఇందుకుటమ్మా నీ విచారం? -మీ దేవతల్లోకూడా వరుసా వావుల విషయంలో ఇంత పట్టింపు ఉందన్నమాట- అయితే మీకన్న మేమే నయం - ఈ ముక్క- అడగడం కోసం - ఇంతదూరం వచ్చావా? - పాపం !-" విని, వాణి తబ్బిబ్బైంది-

"నేను అడిగినదానికి ఇదేనా నీ సమాధానం? -" అంటూ, కసిరినట్టు అడిగింది.

"ఏం సమాధానం కావాలి?"

"చేసినతప్పు ఒప్పుకో - దిద్దుకో!"

"అసంభవం చిన్నదానా!- మనరాత, మీ ఆయన రాతకన్న దొడ్డది - అది అంతే!- మారదు - నీవు, పనిగా కయ్యానికివచ్చావు గనుక అనవలసిన నాలుగుమాటలు మొగ మాటం లేకుండా అనేస్తాను-మనం పలికేది,-భాగవతం పలికిం చేవాడు, అడుగో, వాడు!-ఇందులో నీప్రశక్తి ఎక్కడుంది? నాకుఅబ్బిన అంతో ఇంతో పాండిత్యం-సహజం ! - అంటే,- ఏదైనా వాడి చలవే-" వాణి, మాటకు అడ్డంవచ్చి, రుస రుసగా, "ఇలా పెడసరంగా మాట్లాడటమేనా సహజ పాండి త్యం - !" అంది : పోతన్న ఆ చిడిముడి పాటు గమనించ కుండా - "కామ - ఆడదానివని, - ఇంతవరకూ మర్యాదగా మాట్లాడటం - ఇక పరువుగా, వచ్చిన దోవనే వేంచేయ్- కోదండరాముడికి అంకితం కావడం తలవంపులైందీ నీకు ? - కానీ చూద్దాం - ఎల్లకాలం ఇలాగే ఉంటుందా, - ఎవడో. ఓఘనుడు ఏ అగ్రహారానికో కక్కుర్తిపడి, నిన్ను ఏ

గుఱ్ఱాలుకాసే సాయెబుకో కట్టబెట్టాడనుకో - అప్పుడు ఈ పరువూ మర్యాదలు ఏమౌతాయో మరి_"

మాటల్లోనే వాణి మాయమైంది - పోతన్న తనలో తాను నవ్వుకుంటూ రాముడి సన్నిధికి వచ్చి కూర్చున్నాడు. ఇంతసేపటినుంచీ నక్కి కూర్చున్న హంస, రెక్కలు విరుచుకుని వచ్చి, - గంటం అందించి, - తల ఆయన తొడమీద పెట్టుకుని ఆదమరచి పడుకున్నది.

మ ధు ర

మనది, – పట్టపవలే చుంచులూ, ఎలుకలూ కోలాహలంగా విహారించే,– వెలుగు చీకటుల మారుమూల గది: విడిసినవాడు, సాక్షాత్తూ మహాకవి – అతిథి మర్యాదలు ఇక్కడేం జరుగుతాయి ?–

పవలంతా ఎక్కడెక్కడో తిరిగాడు, పూలదండలు జమ చేసుకున్నాడు–చీకటి పడుతూండగా, తిరిగి వేంచేశాడు–

'భోజనం అయిందా, అన్నా !–' అన్నాను, వేసిన తాళం తీస్తూ–

'రాత్రిపూట,– మనం అపక్వాహారులం !'ఉన్న ఒక్క కుర్చీలోనూ, లుంగలాగా కూలబడి– నాకు అర్థం అయేంత నవ్వు నవ్వాడు,